క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దముడియం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ షంషాద్ భాను తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. గడచిన మూడు నెలల కాలంలో జరిగిన ప్రగతి నివేదికలతో అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

సేవాభావంతో ముందుకెళ్లాలి

ముద్దనూరు: రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు సేవాభావంతో ముందుకెళ్లాలని ప్రముఖ వైద్యులు డా నాగదస్తగిరి రెడ్డి ,రిటైర్డ్ లెక్చరర్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో రెడ్ల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు రాజకీయ, సినీ, సాహిత్య, వ్యాపార, వైద్య రంగాల్లో రాణించి అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో కూడా సేవాభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురిని సత్కరించారు.

ధర్మ మార్గంతోనే భగవత కృప

పులివెందుల టౌన్ : ధర్మమార్గాన్ని అనుసరించే వారికి భగవత కృప ఎప్పుడూ ఉంటుందని ప్రవచనకర్త వేముల కొత్తపల్లి గ్రామ సర్పంచ్ కొప్పాల గంగరాజు పేర్కొన్నారు. స్థానిక పులివెందుల పట్టణంలో గీతా మందిరంలో ఆదివారం సాయంత్రం భాగవత ప్రవచనం నిర్వహించారు. అందులో భాగంగా భాగవతము దశమ స్కంధము పూర్వభాగంలోని శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతమును ఎత్తుట అను ఘట్టమును అద్భుత వ్యాఖ్యాన సహితంగా ప్రవచనం చేశారు. కష్టాలు వస్తేనే భగవంతుడిని ఆరాధించడం సరికాదని, నిత్య భగవదారాధనతో కష్టాలు వైదొలగిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ ధార్మిక మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగవతులు, గీతా మందిర కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీని పరిశీలించిన ఎమ్మెల్సీ


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

సింహాద్రిపురం: మండలంలోని కాంబల్లె గ్రామంలో నిర్మించిన ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులకు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన కాంబల్లెలోని హౌసింగ్ కాలనీని పీడీ రాజారత్నంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016–17 సంవత్సరంలో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ పేరుతో 42 ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. అప్పట్లో కాలనీలో సీసీ రోడ్లు, వేసి నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కాలనీలో డ్రైనేజీ, తాగునీటి పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు


నృత్యం చేస్తున్న యువకులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా పులివెందుల కోలా ప్రసాద్ సహకారంతో కిషోర్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ కిషోర్ ఆధ్వర్యంలో చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వస్తావ జానకి.. వస్తావ జానకి అంటూ సాగే ఈ పాటతో మొదలై రా మచ్చ.. మచ్చ రా తదితర పాటలకు నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. చిన్నారులు వేసిన స్టెప్పులకు సందర్శకుల చప్పట్లతో శిల్పారామం మార్మోగింది. శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షణలో నృత్య ప్రదర్శన నిర్వహించారు.

ఏపీజీబీపై అధికారిక ప్రకటన చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉంటుందని సీఎం చంద్రబాబు మైదుకూరు బహిరంగ సభలో ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ ఎ.రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీజీబీ అమరావతికి తరలిపోదనే భరోసా రాయలసీమ ప్రజలకు కలుగుతుందని, దీనిపై అధికారిక ప్రకటన చేయాలని కోరారు. కర్నూలుకు రావాల్సిన హైకోర్టు స్థానంలో బెంచ్ ఏర్పాటు చేస్తాన్నప్పుడే ప్రజలకు అనుమానాలు పెరిగాయన్నారు. విభజన హామీలు, స్టీల్ ప్లాంటు, హైకోర్టు, విద్యా సంస్థలు, పారిశ్రామిక రాయితీలు, తదితర విషయాల్లో ఆశాభంగానికి గురైన రాయలసీమ వాసులు ముఖ్యమంత్రి చేసిన రాజకీయ ప్రకటనలకు సంతృప్తి చెందడం లేదన్నారు.

గొంతులెండున్నాయ్ సారూ..!

'అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడు నోట్లో శని' అన్న చందంగా ఉంది నల్లపురెడ్డిపల్లె గ్రామ ప్రజల పరిస్థితి. బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉన్నా సరఫరా చేసే వారు లేక గొంతులెండున్నాయి. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం వలన తాగునీటి కోసం గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. తాగునీటి వనరులు, పథకాలు ఉన్నా, వాటిని గ్రామస్తుల దరికి చేర్చడంలో విఫలమయ్యారు. గొంతులెండున్నాయ్ సారూ.. అని అధికారులను వేడుకున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని నల్లపురెడ్డిపల్లె వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాహార్తిని తీర్చాలని వేడుకుంటున్నారు.

- నల్లపురెడ్డి పల్లెలో తాగునీటి సమస్య
- సక్రమంగా నీటిని సరఫరా చేయని సిబ్బంది
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని ఓ కాలనీ

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా నీరు సరఫరా కావడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో 860 కుటుంబాలు నివసిస్తున్నాయి. నీటిని సరఫరా చేసే వాటర్ లైన్‌మన్ ఎప్పుడు నీరు వదులుతాడో చెప్పడం లేదని వారు వాపోతున్నారు. నల్లపురెడ్డి పల్లె గ్రామానికి నీరు వదిలే రోజులను ప్రకటిస్తే అప్పుడు మాత్రమే నీరు పట్టుకుంటామని అంటున్నారు. నీటిని సరఫరా చేసే లైన్‌మెన్లు కూడా అందుబాటులో లేరని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి


ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో తాగునీటి సమస్యలు రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. గ్రామంలో నీటిని విడుదల చేసే తేదీలను, వారాలను ముందుగానే చెబితే నీటిని పట్టుకుంటారు.
– విష్ణురెడ్డి, నల్లపురెడ్డిపల్లె

తాగునీటి కష్టాలు తీరేది ఎన్నడో?


మా గ్రామంలో తాగునీటి సమస్యను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదు. తాగునీటి కష్టాలు ఎప్పుడు తీరుతాయో.
– తులశమ్మ, నల్లపురెడ్డిపల్లె

వైఎస్సార్‌సీపీ నాయకులకు సత్కారం


వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న స్థానిక నేతలు

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీలో పులివెందుల నియోజకవర్గ మండల కన్వీనర్లకు, పట్టణ కన్వీనర్లకు, జిల్లా స్థాయి పదవులు పొందిన నాయకులకు ఆదివారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓతూరు రసూల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పులివెందుల మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, లింగాల మండల అధ్యక్షుడు బాబురెడ్డి, వేముల మండల అధ్యక్షుడు సాంబ శివారెడ్డి, తొండూరు మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్లుగా ఎన్నికైన హాల్ గంగాధర రెడ్డి, హఫీజ్, జిల్లా స్థాయి పదవులు పొందిన పుష్పనాథ రెడ్డి, నూరుల్ల, కోళ్ల భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరప్రసాద్, చిన్నప్ప, జేసీఎస్ కన్వీనర్లు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, సీనియర్ నాయకులు యార్వ వెంకట సుబ్బయ్య, నాయకులు గూడూరు గురు ప్రసాద్, బాబయ్య, కో ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, ఎస్సీ నాయకులు కృష్ణమూర్తి , నాగరాజు, చలపతి, సోపాల వీరా, సర్వోత్తమరెడ్డి, నవీన్, కిరణ్ పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి


ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

కొండాపురం: ఇటీవల రాజ్యసభలో అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే పార్టీకి, పదవికి రాజీనామా చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ గో బ్యాక్ అమిత్‌షా అంటూ సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం బైపాస్ రోడ్డులో నిరసన వ్యక్తం చేయడానికి వెళుతుండగా కొండాపురం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణ, సుబ్బారావు జోసఫ్ పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా వర్గీకరణ ఆగదు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పులివెందుల రూరల్: ఎస్సీ వర్గీకరణను ఆపాలని కొందరు చూస్తున్నాయని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఇది ఆగదని ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ సమన్వయకర్త కొమ్ము నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మాదిగలకు, మాదిగ ఉపకులాలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన లక్ష డప్పులు, 1,000 గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జేసీ రామాంజనేయులు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ సంక్షే రంగాల్లో మాదిగలకు న్యాయం జరగాలన్నారు. ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కిరణ్‌కుమార్, రమేష్, శరణ్ కుమార్, ఉత్తయ్య, రామచంద్రుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు?


ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని మామిళ్లపల్లె పరిధిలోని ఇందిరానగర్ వద్ద రింగు రోడ్డు రహదారికి ప్రక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో స్థానిక నాయకులు అధికార పార్టీ ముసుగులో నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చారు. అక్రమ నిర్మాణాలపై మామిళ్లపల్లి రెవెన్యూ అధికారిని వివరణ కోరగా నిర్మాణాల విషయం తమ దృష్టికి రావడంతో స్థలాన్ని పరిశీలించి, నిర్మాణాలను అడ్డుకున్నామని తెలిపారు. స్థల అనుమతి పత్రాలు ఉన్నట్లు తెలుపడంతో ఆ పత్రాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. అప్పటివరకు నిర్మాణాలను నిలిపేయాలని సదురు నాయకులకు ఆదేశించినట్లు మామిళ్లపల్లె గ్రామ రెవెన్యూ అధికారి తెలిపారు.

అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదు


నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరా, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ ఆదివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ , ఎస్.వెంకట శివ, రామ్మోహన్, రమణయ్య, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, మనోహర్, అన్వేష్, బాదుల్లా, మద్దిలేటి , దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, అంకుశం, రామకృష్ణారెడ్డిపాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవితంలోనే ఆనందం

కడప కల్చరల్: ఆధ్యాత్మిక జీవనంలోనే నిజమైన ఆనందం ఉందని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర అన్నారు. కడప కృపా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ నేటివ్ కృపా చర్చిలో తొలుత పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మతోకలిసి ఆదివారం ఆయన ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ ప్రాంతంలోని ఈ నూతన చర్చి ప్రార్థనలు చేసుకునేందుకు ఎంతో అనువుగా ఉందన్నారు. దైవజనులు పాస్టర్ పి.మహేష్ విశ్వాసుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంఘ పెద్దలు విశ్వాసులతో కలిసి అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రను శాలువాతో సన్మానించి స్వీట్లు పంచి పెట్టారు. యస్.రోశయ్య, దూపం రాజు, పి.రవితేజ పాల్గొన్నారు.

● ఆశల సాగు

కుందూతీరంలో రైతులు రెండో పంటగా వరి సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. నదిలో నీరు సంమృద్ధిగా పారుతోంది. గత ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. దిగుబడి, ధర అంతంత మాత్రంగా ఉండడంతో రెండో పంటగా మళ్లీ వరి సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు. పంట కోత సమయంలో వర్షం పడడంతో చాలా నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. కోటి ఆశలతో రెండో పంట సాగు చేసేందుకు మండలంలోని కుందూ పరివాహక గ్రామాలైన నెమళ్లదిన్నె, గరిశలూరు, బలపనగూడూరు, చిన్నముడియం గ్రామాల రైతులు సిద్ధమవుతున్నారు.

–పెద్దముడియం


ఎద్దులతో దమ్ము కొడుతున్న రైతులు


వరినాట్లను వేస్తున్న మహిళలు


నాటేందుకు సిద్ధంగా ఉన్న వరి నారు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి


ఎండిన మామిడి మొక్కను పరిశీలిస్తున్న రవిశంకర్‌రెడ్డి

వల్లూరు: టెక్నాలజీ రంగంలో ఎంతో అభివృద్ధిని సాధిస్తున్న నేటి రోజుల్లో కూడా ప్రజలందరికీ పట్టెడు అన్నం పెట్టే రైతన్న తీవ్రంగా నష్టపోతున్నారని, రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. పంట పొలాల సందర్శనలో భాగంగా ఆర్‌సీపీ బృందం ఆదివారం వల్లూరు మండలంలోని పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె, గాలివారిపల్లె, సీ. కొత్తపల్లె గ్రామాల్లోని రైతులను కలిసి వారి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో వ్యవసాయం జూదంగా మారిపోయిందని, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో ఎప్పుడూ చూడని కొత్త కొత్త వింతలను నేడు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని, మామిడి, చీనీ చెట్లు నిలువున ఎండిపోతున్నాయని అన్నారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయంలో నష్టపోయిన రైతులను ఆదుకుని వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆవేదనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న హాకీ కడప జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శేఖర్

పులివెందుల టౌన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని బీటీ కాలేజీ హాకీ మైదానంలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ బాలుర అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానం సాధించి చాంపియన్‌గా నిలచింది. డిఫెండింగ్ చాంపియన్ అయిన కడప జట్టు క్వార్టర్ ఫైనల్లో 4–0 కాకినాడ జట్టుపై నెగ్గి సెమీఫైనల్‌లో తిరుపతి జట్టుపై 6–1 తేడాతో విజయ ఢంకా మోగించింది. ఫైనల్లో అనకాపల్లి జట్టుపై హోరా హోరీగా పోరాడి నిర్ణీత సమయంలో 1–1 డ్రా కాగా 8 సెకండ్ల షూట్‌ఔట్‌లో 3–1 తేడాతో కడప జట్టు విజయం సాధించి పలువురి ప్రశంశలు అందుకుంది. విజయం సాధించిన కడప జట్టు క్రీడాకారులను కోచ్ దివాకర్, మేనేజర్ ఖాదర్‌మోహిద్దీన్, హాకీ కడప జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శేఖర్, ప్రెసిడెంట్ రవిచంద్ర, చైర్మన్ శ్రీనివాసులు, సీనియర్ హాకీ క్రీడాకారులు అభినందించారు.

హాకీలో సత్తా

సింహాద్రిపురం : మదనపల్లిలో హాకీ అసోషియేషన్ అధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ జూనియర్స్ విభాగంలో మండలంలోని బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న అరవింద్ అనే విద్యార్థి కడపజిల్లా జట్టులో అత్యంత ప్రతిభ కనబరచి మొదటి స్థానం సాధించాడు. విద్యార్థి విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాసు, గణిత ఉపాధ్యాయుడు ఓ. రామాంజనేయులు, రిటైర్డ్ పీఈటీ రేణుకాదేవి, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నారీ వేషంతో అదిరేటి ప్రదర్శనలు

చింతామణి నాటకంలో తల్లి పాత్రలో రాణిస్తున్న రవిచంద్రారెడ్డి


నాటకంలో ప్రదర్శన ఇస్తున్న రవిచంద్రారెడ్డి

ఎర్రగుంట్ల : చింతామణి నాటకంలో తల్లి పాత్రలో నటిస్తూ నిమ్మకాలయ రవిచంద్రారెడ్డి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం సినిమాల్లో కూడా నటిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. కమలాపురం మండలం సి. రాజుపాలెం గ్రామానికి చెందిన నిమ్మకాయల రవిచంద్రారెడ్డి ఆర్టీపీపీలో ఫీజ్‌ఆఫ్ కాల్, కాలనీలో విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచి నాటకాలపై ఆసక్తి పెంచుకున్నారు. 2011లో వెలుగోడు మండలంలో సాయి కృష్ణాచారి సారథ్యంలో చింతామణి నాటకంలో తల్లి శ్రీహరికుమారి పాత్రను పోషించారు. ఇప్పటి వరకు సుమారుగా 800 నాటకాల్లో నటించారు.

సినిమా రంగంలో..

రవిచంద్రారెడ్డి తన హావభావాలతో కథకు అనుగుణంగా హాస్యపు పండిస్తూ అందరినీ మెప్పిస్తున్నారు. సినీనటి కవితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పలు సంఘాల నాయకుల నుంచి సన్మానాలు పొందారు. హైదరాబాదులో ఇటీవల సరిగిజన గణేష్ కళానికేతన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా నిమ్మకాయల రవిచంద్రారెడ్డికి మహానంది పురస్కారంతో సత్కరించారు. చింతామణి, గ్రంథం, పొట్లగిత్త సినిమాలో నటించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చింతకొమ్మదిన్నె : బయనపల్లెలోని వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 2009 సంవత్సరంతో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి వాళ్లు కలవడంతో ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని తన్మయత్వంలో మునిగి తేలారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాడు ఆటలాడిన ప్రదేశాలను గుర్తు చేసుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకొని సంతోషంగా గడిపారు. హెడ్ మాస్టర్ దీనదయాళ్, ఉపాధ్యాయులు రమణారెడ్డి, కమలమ్మ, అరుణ, కృష్ణారెడ్డి, లలిత,రాజు, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సామాజిక సేవలు

కడప కల్చరల్: కులమతాలకతీతంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సామాజిక సేవలందిస్తోందని సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి అన్నారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవతా సంస్థ సమావేశం డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి గారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ మిత్రునిగా అందిస్తున్న సేవలు పలు కుటుంబాలను ఎంతో ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ముఖ్య అతిథులు మైథిలి, భూపతి రాయల్ సంస్థకు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నిహారిక మాట్లాడుతూ మానవత సంస్థతో కలిసి సామాజిక బాధ్యతను తమ సంస్థ నెరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వేమన పద్యాలతో తెలుగు సమాజానికి వెలుగులు

ఘనంగా యోగివేమన జయంతి


దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గంగాధర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : తెలుగు సమాజానికి తన పద్యాల ద్వారా యోగి వేమన వెలుగులు నింపారని రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హాలు గంగాధరరెడ్డి, డిగ్రీకళాశాల విశ్రాంత అధ్యాపకులు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి కొనియాడారు. మహాకవి యోగి వేమన జయంతి వేడుకలను రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం రెడ్డివెల్ఫేర్ సొసైటీ సహకారంతో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషలో, భావంలో ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేసిన ఘనత వేమనకే దక్కిందని ప్రశంసించారు. సమాజంలో అన్ని అసమానతలు పోయి మనుషులు మానవీయంగా ఎదగాలన్నదే వేమన ఆశయమన్నారు. వేమన పద్యం ఒకటైనా రాని తెలుగువారు ఉండరన్నారు. తెలుగు జాతి ఉన్నతంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకపై నిలిచే ఉంటాయని పేర్కొన్నారు. వేమన విగ్రహాన్ని పులివెందుల పట్టణంలో ఏర్పాటు చేసి భావితరాలకు ఆయన గొప్పతనాన్ని తెలియజేయాలని కోరారు. దివ్యాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, ఎస్.ఆర్.వి ప్రసాద్ రెడ్డి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.